క్లుప్తంగా

స్నేహితుడికి ఆర్థికసాయం



కృష్ణ కుటుంబానికి నగదు అందజేస్తున్న ఆయన స్నేహితులు

తెర్లాం: రాజాం మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన చిత్తూరి కృష్ణకు ఆయన స్నేహితులు ఆర్థికసాయం చేశారు. కొన్నాళ్లుగా కృష్ణ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనతో కలిసి తెర్లాం మండలంలోని పెరుమాళి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులంతా ఈ విషయం తెలుసుకుని, చందాల రూపంలో సేకరించిన రూ.35 వేలను శుక్రవారం వారి ఇంటికి వెళ్లి, అందజేశారు. మిత్రుల సాయం చూసి గ్రామస్తులంతా మెచ్చుకుంటున్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

రామభద్రపురం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మండల ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం శుక్రవారం ఏర్పాటు చేశారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని సంఘ సభ్యులు తెలిపారు. రోజుకో సభ్యుడు రూ.2,500 చొప్పున వెచ్చించి మరీ పెరుగు కొనుగోలు చేసి, మజ్జిగ తయారు చేసి ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పి.రామారావు, ఎస్.అన్నాజీరావు, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ పనుల పరిశీలన



తోటపల్లి ప్రధాన కుడికాలువలో చేస్తున్న జంగిల్ క్లియరెన్స్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండల కేంద్రం మీదుగా వెళ్తున్న తోటపల్లి ప్రధాన కుడికాలువలో చేపడుతున్న పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు కాలువ గట్టు వెంబడి విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా సాగు నీరు సాఫీగా సాగడం లేదని, ఈ నేపథ్యంలో వాటిని ఉపాధి హామీ పనుల వేతనదారులతో తొలగించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, వేతనదారులకు రోజువారీ వేతనం రూ.257లు వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

పక్కాగా ప్రత్యేక తరగతులు



కొట్టక్కిలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ రమామణి సూచించారు. మండలంలోని రామభద్రపురం, కొట్టక్కి, ఆరికతోట, బూసాయవలస గ్రామ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న తరగతులను శుక్రవారం పరిశీలించిన ఆమె తరగతుల నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఒక్క కొట్టక్కి పాఠశాలలో తప్ప మిగతా చోట్ల జరుగుతున్న తరగతులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఇలాగైతే సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత పెంచడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. హెచ్ఎంలు బాధ్యత తీసుకుని, ఫెయిలైన విద్యార్థులంతా తరగతులకు హాజరై, పాస్ అయ్యేలా చూడాలని తెలిపారు.

విత్తనాలు, ఎరువుల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీరాములునాయుడు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు విత్తనాలు, ఎరువులు శుక్రవారం పంపిణీ చేశారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం పేర్లు నమోదు చేసుకున్న వారికి వాటిని అందిస్తున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు వంగపండు శ్రీరాములునాయుడు తెలిపారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

రాజాం: స్థానిక జీఎంఆర్ఐటీ కళాశాలలో ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 257 మంది విద్యార్థులకు గాను 244 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

సంక్షేమ పథకాలతో జీవన ప్రమాణాలు మెరుగు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బంకురువలస గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల బాగోగులే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అభివృద్ధి, పథకాలను సమాంతరంగా అమలు చేస్తున్న ఘనత ఆయనదేనన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిచడం జరుగుతోందన్నారు. ప్రతీ ఇంటికి లబ్ధి జరిగేలా పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల ప్రమేయం లేనిదే వచ్చేవి కావన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్ల ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే పథకాలు అందుతున్నాయన్నారు. అవసరమైన చోట అభివృద్ధి పనులు కూడా మంజూరవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సంకిలి శాంతకుమారి, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి గొప్ప పోరాటయోధుడు



పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న పూడివలస గ్రామస్తులు



రాజాంసిటీ: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

బాడంగి: మండలంలోని పూడివలస గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. పుచ్చలపల్లి గొప్ప పోరాట యోధుడు అని సీపీఎం నాయకుడు కృష్ణ కొనియాడారు. సమాజ హితమే లక్ష్యంగా ఆయన అనేక పోరాటాలు సాగించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. పిల్లలుంటే ఉద్యమానికి వెళ్లడం కుదరదని అని చెప్పి, ఏకంగా పిల్లలనే కనడం మానేసిన గొప్ప వ్యక్తి ఆయన అని అన్నారు. చిన్నతనం నుంచే కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడారని, ఇదే ఆయనలోని అందరూ సమానమేనన్న భావనకు నిదర్శనమన్నారు. పార్లమెంట్‌కు కూడా సైకిల్‌పై వెళ్లి, తన నిరాడంబరతను చాటుకున్నారన్నారు. ఆయన జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

రాజాం సిటీ: మండల కేంద్రంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన మహానేత, ఆదర్శమూర్తి, పీడిత ప్రజల పక్షపాతి సుందరయ్య అని కొనియాడారు. ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన సుందరయ్య ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో చిరంజీవి, శ్రీనివాసరావు, రాంబాబు, రాము, తేజ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణ పరిధిలోని రెడ్డిక వీధిలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



సంతకవిటి: మేడమర్తిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేడమర్తి గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ఆయన తన పాదయాత్ర, ప్రజాసంకల్పయాత్ర, సభలు, సమావేశాలు, సదస్సుల్లో ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలను నెరవేర్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతం హామీలు అమలు చేసి, తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. ఇంతవరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే టీడీపీ, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ఎవ్వరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ కె. సందీప్‌కుమార్, ఎంపీపీ ఎస్.మంజుల, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, సర్పంచ్ ఎ.లక్ష్మి, తహసీల్దారు సులోచనారాణి, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు కుంటినవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తివిక్రమ్ ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర హాజరుకానున్నారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



రామభద్రపురం సచివాలయంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

రామభద్రపురం: ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు ఏటా ఇచ్చే సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర నగదు పురస్కారాల పంపిణీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మండలంలోని వలంటీర్లంతా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, థాంక్యూ సీఎం సార్ అని కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 10 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాల్లో సేవామిత్రకు ఎంపికైన వారికి రూ.10 వేలు, సేవారత్నకు ఎంపికైన వారికి రూ.20 వేలు, సేవావజ్రకు ఎంపికైన వారికి రూ.30 వేల నగదు అందజేయనున్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రాజాం: స్థానిక పట్టణంలోని గాయత్రి కాలనీ, మాధవ బజార్, ప్రధాన రోడ్లలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. రోడ్లు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, దానిని డంపింగ్‌యార్డుకు తరలించారు. శుక్రవారం ఈ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి తెలిపారు.

గొడుగుల వితరణ



గొడుగులు, చెప్పులు అందజేస్తున్న నైటింగేల్ మహిళా వెల్ఫేర్ క్లబ్ సభ్యులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని నిరుపేదలు, యాచకులకు గొడుగులు, చెప్పులను నైటింగేల్ మహిళా వెల్ఫేర్ క్లబ్ అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ నాయకురాలు తూముల అచ్యుతవల్లి, క్లబ్ సభ్యులు కలిసి శుక్రవారం వితరణ చేశారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని, వడదెబ్బ బారినపడకుండా వీటిని పంపిణీ చేశామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

రాజాం: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పెనుబాక యూపీ స్కూల్ హెచ్ఎం జి.శ్రీలక్ష్మి కోరారు. శుక్రవారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, వసతుల కల్పనపై అవగాహన కల్పించారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్య సర్కారు బడుల్లోనే దొరుకుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు. అనంతరం పలువురు చిన్నారులను అడ్మిషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు కె.మధుసూదనరావు, బలరామ్మూర్తి, విజయలక్ష్మి, కామేశ్వరమ్మ, రవికుమార్, శారద పాల్గొన్నారు.

పారాదిలో 'వలంటీర్లకు వందనం'



వలంటీర్ల నగదు పురస్కారాల చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని పారాది గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు చేతులమీదుగా ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వలంటీర్లు అని, వారి ద్వారానే సంక్షేమ పాలన సాధ్యమవుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం వలంటీర్ల నగదు పురస్కారాలకు సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సర్పంచ్, ఎంపీటీసీలు నానేశ్వరి, ఉమా, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్ మోహన్‌రావు

సంతకవిటి: అన్ని శాఖల అధికారుల సహకారంతోనే మండలంలో అభివృద్ధి సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.మంజుల అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మండలంలోని అన్ని పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అంతకుముందు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్ష నిర్వహించగా జేఈ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ వేసవిలో నీటిఎద్దడి లేకుండా క్రాస్‌పోగ్రాం ద్వారా బోర్లు మరమ్మతులు చేశామని తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి, తహసీల్దార్ సులోచనరాణి మాట్లాడుతూ ప్రతినెలా సరైన సమయానికి లబ్ధిదారుల ఇంటి వద్దకే మొబైల్ వ్యాన్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలో ఐరిస్ ద్వారా కూడా సరుకులు అందిస్తామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ గృహనిర్మాణదారులకు సకాలంలో పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఓ నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ, కృష్ణంవలస సర్పంచ్ సురేష్, చిత్తారిపురం సర్పంచ్ మోహన్‌రావు, జేసీఎస్ కన్వీనర్ రమేష్‌నాయుడు, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, ఏపీడీ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో సర్వే చేయండి

రేగిడి: రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేయండి అని తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి సూచించారు. శుక్రవారం మండలంలోని అక్కన్నఅగ్రహారం గ్రామంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించిన ఆయన పక్కాగా రీసర్వే చేయాలని, రైతులున్నప్పుడే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని తెలిపారు.

సకాలంలో వేతనాలు అందేలా చర్యలు



రాజాం: మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

రాజాం: ఉపాధి హామీ పనుల వేతనదారులకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్‌లతో సమావేశమైన ఆయన ప్రతీ రెండు వారాలకు సంబంధించిన వేతనాలు వేతనదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వేతనదారునికి పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, ఏపీఓ సాయిరాం, జేఈ నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేయాలి..

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారుల జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేయించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి క్షేత్ర, సాంకేతిక సహాయకులతో సమావేశమైన ఆయన జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయకపోతే వేతనాల చెల్లింపుల్లో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వేతనదారులకు వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



సంతకవిటి: అప్పలఅగ్రహారం వద్ద రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు



రాజాం సిటీ: విద్యుత్ స్తంభంపై పడిన తాటిచెట్టు

సంతకవిటి/రాజాంసిటీ: మండలంలోని పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం వీచిన గాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజల రాకపోకలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం



రాజాం: వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న అధికారులు



తెర్లాం: లింగాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు

రాజాం: మండలంలో వీఆర్అగ్రహారం, అంతకాపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ శంకరరావు, ఏపీఓ సాయిరాం శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పనికి వచ్చిన వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం వస్తుందన్నారు.

రేగిడి: మండలంలోని కొమెర, అక్కన్నఅగ్రహారం, లక్ష్మీపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు శుక్రవారం పరిశీలించారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా పని కావాలని దరఖాస్తు చేసుకున్న ప్రతీ వేతనదారునికి పని కల్పించాలని ఏపీఓ జగదీశ్వరరావు సూచించారు. మండలంలోని లింగాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించిన ఆయన వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రతిరోజూ ఎండ చల్లబడిన తర్వాత పనులకు వెళ్లాలని తెలిపారు. పనిలోకి వచ్చేటప్పుడు తప్పనిసరిగా తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ పౌడర్ కలిపిన నీరు తెచ్చుకోవాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

సంక్షిప్తంగా...

అప్రమత్తంగా ఉండాలి

వంగర: గ్రామాల్లో దొంగతనాలు జరుగుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు సూచించారు. శుక్రవారం మండలంలోని శివ్వాం గ్రామస్తులతో మాట్లాడిన ఆయన ప్రస్తుతం వేసవి కావడంతో ఆరుబయటే నిద్రిస్తున్నారని, ఆ సమయంలో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. రాత్రి సమయాల్లో దొంగతనాలు జరగకుండా సిబ్బందితో పెట్రోలింగ్ ముమ్మరం చేయిస్తామని, గ్రామస్తులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానంగా గ్రామంలో సంచరిస్తున్నట్లు తెలిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

నీటి ఆదాకే సూక్ష్మసేద్యం

రేగిడి: నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నీటిని ఆదా చేసేందుకు సూక్ష్మసేద్యం ఉపయోగపడుతుందని మైక్రో ఇరిగేషన్ జిల్లా సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని మునకలవలస గ్రామంలో రైతులకు అందించిన స్ప్రింక్లరింగ్ పైపులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సూక్ష్మసేద్యంలో భాగంగా రైతులకు 55 శాతం, 90 శాతం రాయితీలతో అందిస్తున్న ఈ పైపులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

నాడు–నేడు పనులను వేగవంతం చేయండి

తెర్లాం: పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు పథకం పనులను వేసవి సెలవుల్లోగా పూర్తి చేసేలా పనులు వేగవంతం చేయాలని వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, ఎంఈఓ జె.త్రినాధరావు సూచించారు. స్థానిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం వారు పరిశీలించి, పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా చూడాలని తెలిపారు.

22న మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.అక్కారావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు హాజరవుతారని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

10 మద్యంసీసాల స్వాధీనం

మెంటాడ: మండలంలోని కొంపంగి నుంచి ఇద్దనవలసకు వెళ్లేదారిలోని వంతెన వద్ద అక్రమంగా మద్యంసీసాలు తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామని ఆంధ్ర ఎస్ఐ సిద్ధార్థ శుక్రవారం తెలిపారు. సదరు వ్యక్తి నుంచి 10 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఐరిష్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీ

రాజాం సిటీ: వేలిముద్రలు సరిగా పడని రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఇకనుంచి ఐరిష్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు చేపడుతున్నామని డీటీ చిరంజీవరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, దినసరి కూలీలకు గతంలో వేలిముద్రలు పడక, ఇబ్బందులు పడేవారని, వీటిని అధిగమించేందుకు ఎండీయూ ఆపరేటర్లకు ఐరిష్ రీడర్లు అందించనున్నామని తెలిపారు.

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట దగ్గర జరుగుతున్న తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ శుక్రవారం పరిశీలించారు. పనులను త్వరితగతం చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు.